కథ

# రామస్వస్తి రావణస్వస్తి

– వలివేటి నాగచంద్రావతి

రాజశేఖరంగారు గెలిచారు. మా ఊరి మునిసిపల్ ఎన్నికల్లో ఇరవైనాల్గవ డివిజన్ అభ్యర్థిగా పోటీలోకి దిగి, తన ప్రత్యర్థీ ముగిసిన టర్మ్‌కి కౌన్సిలరూ అయిన చిదంబరం గారి మీద నలభైతొమ్మిది ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు.

పూలదండలూ పుష్పగుచ్ఛాలూ ఊరేగింపులూ జేజేధ్వానాలూ విందులూ అభినందనలూ వెనకబట్టి, అవి కలిగించిన పొంగు కొద్దికొద్దిగా తగ్గుమొహం పడుతున్న వేళ రాజశేఖరం గారిని కలిసి చిరునవ్వు మొహంతో నమస్కారబాణం వదిలాడు గోవిందయ్య.

'ఇతగాణ్ణెక్కడ చూశానా?' అని క్షణం గుర్తుచేసుకుంటే జ్ఞాపకం వచ్చింది- చిదంబరం గారి వెనక తోకలా తిరుగుతోంటే చూసినట్టు.

"ఇలా వచ్చావేమిటీ?" కొంచెం ముభావంగా అడిగారు రాజశేఖరంగారు.

"అదేమిటలా అడిగారు మహాప్రభో! ఇంద్రసభకి బృహస్పతి ఎన్నికైనట్టు మన ఊరి మునిసిపాలిటీలో స్థానం సంపాదించిన శుభసందర్భంలో తమర్ని దర్శించుకోకుండా ఎలా ఉండగలను?"

"ఆహా! ఇంద్రసభ... బృహస్పతి... ఉపమానం బావుందయ్యా. మరి నిన్నటిదాకా ప్రదక్షిణాలు చేశావే- ఆ కొలువునేమంటావు? చిదంబరాన్ని ఎవరితో పోల్చుతావు?"

"అయ్యా, మీరేమనుకున్నాసరే... అదో గణాచర్ల కూటమి. ఆయనో పోతురాజు. అంతే".

"ఏమిటేమిటీ, ఆ చిదంబరం పోతురాజూ, అతని చుట్టూరా ఉన్నవాళ్ళు పూనకం వచ్చిన వాళ్ళూనా?"

"మరి? ఎప్పుడూ ఎవరోఒకర్ని ఆడిపోసుకుంటూనో, 'వాణ్ణి ఈ విధంగా పడగొట్టాలి... వీణ్ణి ఈ మాదిరి లొంగదియ్యాలి... ఫలానాదాన్లో ఇంత మూటకట్టుకోవాలి' అని క్షణక్షణం మంతనాలు సాగిస్తూండే వాళ్ళనేమనాలో చెప్పండి?"

"మరి అతనికే కదయ్యా, ఇప్పటిదాకా వంగివంగి మొక్కావు?"

"ఏం చెయ్యమంటారు స్వామీ, గ్రామదేవత మందిరం పక్కగా దారి. వెడుతూవెడుతూ పోతురాజు శిలముందర తల వంచుతాం. బలవంతపు బ్రాహ్మణార్థం అది. కానీ ఇప్పుడు మీ సన్నిధికి రావటమూ అదీ ఒకటనిమాత్రం అనుకోవద్దు సుమీ!"

"ఏం ఎందుకొకటి కావూ? ఆ తేడా ఏమిటో అది కూడా నువ్వే చెప్పూ?"

"మీకు తెలీని విషయమా దేవరా! కోవెల్లో దేవుడు కరుణామయుడు. మనల్ని రక్షించి కాపాడతాడని దేవాలయం ఎక్కడున్నా వెతుక్కుంటూ వెడతాం. వరాలిమ్మని వేడుకుంటూ నమస్కరిస్తాం. అదే పోతురాజునో- ఎక్కడ మీదపడి పీక్కుతింటాడో అని భయంతో తల వంచి దణ్ణంపెట్టి దాటుకుంటాం. అదీ తేడా".

"మనకు ఎక్స్‌పార్టీవాడు కదా అని ఆ చిదంబరాన్ని మరీ పీక్కుతినేవాడిగా వర్ణించకోయ్. డివిజనుకి తను చేయగలిగిన సేవ అతనూ చేశాట్టగా?"

"ఏం చేశాడు, అహఁ... ఏం చేశాడూ అంటాను. ఒక్కటి చెప్పండి వింటాను".

"వార్డులో వీధికో మంచినీళ్ళ పంపు వేయించాట్ట. సందుకో చెత్తకుండీ పెటించాట్ట. లోక్లాసు వాళ్ళుండే ఏరియాలో గుడి కట్టించుకోమని అక్కడున్న తన జాగాని దానం చేశాట్ట".

"అవునవును, కొళాయిలు వేయించాడు. ఎక్కడా- తనకి భజనచేసేవాళ్ళ ఇంటిపెరటి వాకిలికి ఆనుకునేటట్లుగా. మరి ట్యూబు పెట్టుకుంటే నీళ్ళు పెరట్లోకి వచ్చేటట్లుండాలిగా- అందుకు. చెత్తకుండీలు పెట్టించాడు... అవెక్కడా- తనకి ఓటేయలేదని అనుమానమొచ్చిన వాళ్ళ ఇంటిముందర. చెత్తాచెదారం, కంపు, కుక్కలు, దోమలు. మీ చావు మీరు చావండని వాళ్ళ రోగం కుదిర్చాడు. అవీ ఇవీ చేశాడని విన్నారు గానీ ఈ మర్మం మీకు తెలుసా అని".

"అవునా? నాకు తెలీదుస్మీ".

"మీరు బోళాశంకరులు. మీకిలాటివేమి తెలుస్తాయిలెండి. ఇక ఆ స్థలం సంగతీ చెప్తాను వినండి. మురికివాడల మధ్యలో పదిబారల పనికిరాని స్థలం అది. వంద కాయితం పడేసి పదికి కొనమంటే ముందుకి రారెవ్వరూ. అంచేత ధారాళంగా దానమిచ్చేసి వాళ్ళ ఓట్లన్నీ తన ఖాతాలో పర్మినెంటుగా జమేయించుకున్నాడు. అదీ లౌక్యం. పుణ్యానికి పుణ్యం... పురుషార్థానికి పురుషార్థం".

"ఔరా! ఏమి తెలివీ ఏమి తెలివీ. ఔనూ మొన్నటి ఎలక్షన్‌లో కూడా ఏవో చీప్ ట్రిక్స్ ప్రయోగించాడని విన్నానే".

"అయ్యో రామా, మీరు విన్నారంతే, నేను స్వయంగా చూశానుగదా. ఆడవాళ్ళకి జాకెట్టు గుడ్డలూ మగవాళ్ళకి చేతికర్రలూ కానుగ్గా పంపిణీ చేశాడండయ్యా".

"నాకిలాంటి చిల్లరపనులు కిట్టవు సుమా".

"అమ్మమ్మమ్మ, మీకంత గ్రహచారమేమి పట్టిందండయ్యా? భక్తుల దగ్గరకే భగవంతుడు వెతుక్కుంటూ వెళ్ళినట్టూ... తమంతటివారు హోదాని పక్కకిపెట్టి, అంతస్తు దిగివచ్చి స్వయంగా వెళ్ళి ఓటడగటం చాలదా? మీ అంత స్ఫురద్రూపీ సుందరరూపం కట్టెదుట నిలబడి అడగటమే అదృష్టమని, తమని గెలిపించలేదా ఓటర్లు?"

"ఆకారానిదేవుందిలేవయ్యా. ఒడ్డూ పొడుగూ ఉండటం కూడా గొప్పేనా?"

"అహహహహ... అలా తేలిగ్గా తమరి అందాన్నీ ఆజానుబాహు రూపాన్నీ తీసేయకండయ్యా. ఆ రీవీ వర్చస్సూ అందరికీ వస్తాయా చెప్పండి. మాటవరసకి ఆ చిదంబరం- రుబ్బుపొత్రానికి లాల్చీ పంచా తొడిగినట్టుంటాడు. ఎదురుపడితే వదిలించుకోవటానికి దణ్ణం పెడతారంతే. మొన్న ఎలక్షన్‌లో చూశారుగా".

"నాదంతా మా నాన్నగారి పోలికయ్యా".

"మీ తండ్రిగారే కాదండీ, తమరి తాతముత్తాతలు కూడా దబ్బపండు ఛాయలో బహుసుందరులూ చేయెత్తు మనుషులూనట. టాపులేని గుర్రబ్బండెక్కి రోడ్డున వెడుతోంటే చూడ్డానికి రెండుకళ్ళూ చాలేవికావనీ ఆడవాళ్ళు సైతం తలుపు అడ్డంపెట్టుకు చూసేవారనీ మా నాన్నగారు చెబుతూండేవారు".

"అది సరేలేవయ్యా, అందం గురించి తప్ప మా పూర్వీకుల ఇతర క్వాలిఫికేషన్లేవీ నీకు తెలిసినట్టులేదే?"

"భలేవారండయ్యా, తెలీకపోటానికి వారి కీర్తిప్రతిష్ఠలు సామాన్యమైనవా? పండిన పనసపండుకదండీ. దాచితే దాగేదా ఆ సువాసన".

"ఆహా, ఏం తెలుసేం నీకు?"

"అయ్యా, ఆ చిదంబరంలాగా ఆషామాషీ వంశమా తమది- తాత వ్యవసాయ కూలీ తండ్రి ఫ్యాక్టరీ వర్కరూ అని రెండుముక్కల్లో తేల్చెయ్యటానికి.

మీ ముత్తాతగారు మొఖాసాదరు. గొప్ప రాజభక్తులు. ఆంగ్లేయులే వారి సేవలకు మెచ్చి బిరుదులివ్వబోతే వద్దని నిరాకరించిన నిరాడంబరులు. మీ తాతగారు మీ సొంత ఊరి పంచాయితీకి ప్రెసిడెంటుగా సింహాసనాన్నలంకరించినవారు. టౌను నుంచి ఆ పల్లెటూరుదాకా తారురోడ్డు వేయించి ఒంటెద్దుబండి తప్ప ఇతర ప్రయాణసాధనాలెరగని ఆ ఊరుకి బస్సులూ లారీలూ రప్పించిన ఘనత వారిది. అయ్యా, లోకులు కాకులు. అది ఊరికి ఉద్ధరింపు కాదు. స్వప్రయోజనం కొరకే అని కూశారట. పోనీండి, వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు.

ఇక మీ నాన్నగారైతే పార్టీలో లుకలుకలవల్ల కాస్తలో తప్పిపోయిందికానీ, ఈ ఊరికి ఛైర్మన్ కావలసిన మహానుభావులు. ఈ పట్టణాభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకున్నవారిలో ముఖ్యులుగా ప్రసిద్ధిపొందిన గొప్ప వ్యక్తి. అసలు మీ వంశచరిత్రని పాఠ్యాంశాలుగా



బోధించాలని మా తాతగారెప్పుడూ అంటూండేవారు".

"పొగడ్తలు మరీ ఎక్కువయినట్టుగా ఉందయ్యా".

"చిత్తం. ఉన్నది ఉన్నట్టుగా చెప్పటమే నాకలవాటండయ్యా. అవసరానికి పొగడ్డం లేదంటే బురద చల్లటం నాకస్సలు కిట్టదండయ్యా".

"నాకు కూడా మా పూర్వీకులమాదిరే ప్రజాసేవ చేయాలని ఆరాటమోయ్. ఏవో సేవాసంస్థల్లో సభ్యత్వాలున్నాయనుకో. ఏమైనా మన ఊరికీ మనవాళ్ళకీ మనం చెయ్యగలిగిన సహాయం చేయటంలో ఉండే తృప్తి వేరుగదా... ఏమంటావ్?"

"అవునవును. మీకా సేవాగుణమబ్బటం మీ వంశం వారిలో పారుతున్న రక్త లక్షణమైతే, ఆ సేవేదో మాకే చేయాలని ఎలక్షన్‌లో నిలబడి గెలిచారు చూడండి- అది మేము చేసుకున్న అదృష్టం. ఈ ఊరు చేసుకున్న పుణ్యం".

"మీలాంటివాళ్ళేనయ్యా నిజం గ్రహించేది".

"చిత్తం చిత్తం. ఈ చిన్న పదవి తమకి మొదటి మెట్టేనయ్యా. తమరు ఛైర్మన్ కావాలి. అంతేనా, అసెంబ్లీకి వెళ్ళాలి. పార్లమెంటుకి ఎన్నికవ్వాలి. అవుతారు. నాకు తెలుసు".

"ఏదో నీ అభిమానం. అదిసరేగానీ, అప్పుడప్పుడూ వస్తుండవయ్యా. కాస్త నాకు సాయంగా ఉందూగానీ".

"మీరు రమ్మనాలేగానీ అంతకన్నా మహద్భాగ్యమా మహాప్రభో. రోజూ తమరి దరిశనం చేసుకుంటాను".

"అన్నట్టు. తోటలోంచి అరటిగెలలు వచ్చినట్టున్నాయి. వెళ్ళేప్పుడు ఓ గెల తీసుకుపో. పిల్లలు తింటారు".

"చిత్తం చిత్తం"

★ ★ ★

అయిదేళ్ళు అలాగ్గా గడిచిపోయాయి. ఈసారి విజయలక్ష్మి మళ్ళీ చిదంబరంగారి మెళ్ళో దండ వేసింది.

మూడోరోజాకల్లా చిదంబరంగారి ఇంటి వరండాలోకి ఎంటరయ్యాడు గోవిందయ్య.

"ఎందుకొచ్చావ్?" అన్నాడు చిదంబరం గుర్రుగా.

"అదేమిటలా అడిగావు గురువా? ఈ ఇల్లేగదా నా సొంతగూడు. ఇక్కడికిరాక ఇంకెక్కడికి పోతాను?"

"నీకెందుకయ్యా ఈ బోడిబిక్కి కొంప. రాజప్రాసాదంలో చోటు దొరికిందిగద" చిదంబరం నిష్ఠూరం.

"ఆయనో రాజా... అదో రాజప్రాసాదం. హుఁ".

"ఏమిటా హుంకారం. కాదా?"

"కాదు మహాప్రభో కాదు. ఆయనో డిక్టేటరు. అదో బానిసల నరకం".

"అదేమిటా కొత్త ఉపమానం? ఉన్నట్టుండి అంత మాటనేశావేమిటీ?"

"ఇంకేమనమంటారు. ఎంతసేపూ ఆయనకు తను తక్త మీద కొలువుతీరితే మిగతా జనాలు జేజేలు పలకాలి. వాళ్ళ దగ్గర వంగి సలాములు చేయాలి. ఆయన అందచందాల్నీ భోగభాగ్యాల్నీ పొగడాలి. 'మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడమన్నట్టుగా' ఆయన చెప్పే ఘరానా కబుర్లకి తలలూగించాలి. ఇరవైనాలుగ్గంటలూ ఈ భజన రంధే తప్ప మరో వ్యాపకం లేదనుకోండి. అక్కడి నాటకం చూసీచూసీ విసుగెత్తిపోయింది నాకు".

"ఎందుకు పాపం. నువ్వూ ఇప్పటిదాకా అలాగ వంతపాడినవాడివేగా?"

"అవును. పాడాను. శత్రుశిబిరం ఆనుపానూ తెలుసుకోవాలని వెళ్ళినవాడు వాళ్ళలో కలిసిపోయి నటించక తప్పుతుందా చెప్పండి?"

"ఏమిటీ, నిజమే చెబుతున్నావా?"

"అవును గురువా. నేనెక్కడున్నా నీవాణ్ణే. నేనక్కడికి వెళ్ళిందే ఆయనగారి వ్యవహారమేమిటో చూసొద్దామని. అంతే. నన్ను నమ్ము".

"నాకూ ఆ అనుమానమొచ్చిందనుకో..."

"ఒచ్చిందా? నాకు తెలుసు. మీరు నా మనసులోని మర్మం గ్రహిస్తారని".

"ఇన్నేళ్ళలో ఒక్కసారీ తొంగిచూశావు కాదు".

"వాళ్ళకి అనుమానం రాకూడదనీ..."

"అదిసరే, ఇంతకీ ఏమిటి సంగతులు చెప్పుచెప్పు".

"ఏం చెప్పమంటారు, ఏమున్నదని చెప్పమంటారు?"

"అలా అంటావేమిటి? లైబ్రరీ తెరిపించాట్ట. కల్యాణ మండపం కట్టించాట్ట. పిల్లలకోసం పార్కు వేయించాట్ట. ఊరుఊరంతా ఆయన్ని మెచ్చుకుంటోంటే నువ్వలా చప్పరిస్తావేమిటి?"

"లైబ్రరీ, కల్యాణమండపం, చిల్డ్రన్ పార్కూ... భలే భలే. నేనో నిజం చెప్పనా? అవన్నీ ఒకటేనండీ బాబూ!"

"ఎట్టెట్టా?"

"నా మాట నిజమండీ బాబూ. వచ్చేవాళ్ళెవరూలేక మూసేసిన రీడింగుహాలు తాళం తీయించి, సున్నం కొట్టించి, తనింట్లోవాళ్ళు చదివేసి ఊరికేపడున్న పది పుస్తకాలు తెచ్చిపడేసి అది లైబ్రరీ అనీ పై డాబామీద నాలుగు సిమెంటు స్తంభాలు నిలబెట్టి టాపువేసి అదో కల్యాణమండపమనీ చుట్టూరా ఉన్న జాగాలో ఓ జారుడుబల్లా, ఓ ఉయ్యాలబల్లా బిగించి, ఓ డజను పూలకుండీలు సర్దించి అది పిల్లల పార్కు అనీ పేర్లు పెట్టాడు. వాటికైన ఖర్చు లక్ష రూపాయలని చూపించాడు. ఇక మూడింటికీ మూడు తఫాలు పార్టీ పెద్దల్ని ఆహ్వానించి మూడుసార్లు ప్రారంభోత్సవాలు జరిపించాడు. వాటికైన ఖర్చు ఎంతో తెలుసునా- అక్షరాలా మూడు లక్షలు. అదీ ఆయన నిర్వాకం".

"నిర్వాకం కాదు, ప్రయోజకత్వం".

"అదెట్లా సారూ?"

"తమని ఆహ్వానించి రాచమర్యాదలు జరిపినందుకు పార్టీపెద్దల గుర్తింపు, ఈ చిన్న టౌనుకి అంతటి పెద్దల్ని రప్పించేందుకు కారణాలు కల్పించటమేకాక తనకి అధ్యక్ష స్థానమిచ్చి పెద్దరికం కట్టబెట్టినందుగ్గానూ ఛైర్మనుగారి మెప్పు. ఏ ప్రత్యేకతాలేని ఈ నియోజకవర్గానికి కొత్త అలంకారాలు అద్దారంటూ ప్రచారంచేసిన భజనపరుల కితాబులు- ఇవి చాలవా నిదర్శనాలు- బతకనేర్చినవాడనటానికి".

"ఔను సుమా, మీరు చెప్పిందీ నిజమే. అన్నట్టు మీరు మరిచిపోయిందింకొకటి చెప్పనా- ఈ పెంచుకున్న పరిచయాలతో బావమరిది పేరిట కాంట్రాక్టులు సంపాయించటం..."

"మరి చెప్పవేం?"

"కాకాలు పట్టడం, హంగామాలు చేయటం, బిరుదులూ పదవులూ కొట్టెయ్యటం, తాతముత్తాతల కాలంనుంచీ వారింటి ఆనవాయితీయేనండీ బాబూ. అందుకీయనమాత్రం మినహాయింపెందుకవుతాడూ?"

"తెలుసు తెలుసు. ఆ తెల్లదొరలతో భుజాలు



రాసుకున్న ఆయనగారి పెద్దల సంగతీ తెలుసు. ఈ నల్లదొరలతో చేతులు కలిపే ఈయన సంగతీ తెలుసు. ఏమిటోనయ్యా, నాకా విద్య ఏమాత్రం చేతకాదు సుమీ. నువ్వన్నట్టు అది రక్తం ద్వారానే సంక్రమిస్తుందేమో! ఏం చేస్తాం, ఆ బుద్ధి మావాళ్ళెవరికీ ఉన్నట్టులేదు".

"ఏదీ- ఒకరి భుజంపట్టుకు పైమెట్టెక్కే స్వభావమా? మీవాళ్ళలోనా? కలికానికి కూడా దొరకదు. నేను గ్యారంటీ".

"బల్ల గుద్దినట్టు చెబుతున్నావ్. మావాళ్ళ గురించి నీకేం తెలుసేం?"

"వినండి చెబుతా. మీ తాతా తండ్రీ రైతుకూలీగా ఫ్యాక్టరీ శ్రామికుడిగా జీవితాన్నారంభించినవాళ్ళు. కష్టమంటే ఏమిటో చెమట విలువేమిటో తెలిసినవాళ్ళు. తోటి పనివాళ్ళకి న్యాయం చేయటంకోసం యజమానుల దౌర్జన్యాలకు ధైర్యంగా ఎదురుతిరిగి పోరాడి గెలిచినవాళ్ళు. స్వశక్తిని మాత్రమే నమ్ముకుని ముఠామేస్త్రీలయ్యారు. కార్మిక నాయకులయ్యారు. యూనియన్ లీడర్లుగా ఎదిగారు. కష్టించి పనిచేసే శ్రమజీవుల ముందున్నారు. వారికోసం బతికారు".

"పదిమందీ బాగుంటేనే మనమూ బాగుంటామనుకునే మనస్తత్వమేనయ్యా నాదీను. మాటలతో కోటలు కట్టడం, పదవులకోసం బిరుదులకోసం పాకులాడ్డం చేతకాదు. ఇష్టమూ ఉండదు".

"మీరు చెప్పాలా, నాకు తెలీదూ. ఏదో ప్రజలకింత సాయంచేయాలన్నా వాళ్ళ కష్టాలు తీర్చాలన్నా తప్పనిసరని ఈ పదవిలోకొచ్చారుగానీ..."

"ఆయన... ఆ రాజశేఖరమూ అదే ఉద్దేశ్యంతో వచ్చి ఉండచ్చనుకో..."

"ఏమో మరి. నాకలా అనిపించలేదు. అహఁ... నాకు తెలీకడుగుతానూ, మీ సేవకోసం నన్ను గెలిపించండని పోస్టర్లమీద అచ్చేయించుకుని, గోడల నిండా అతికిపించి గెలిచినవాడు ఎలా ఉండాలి? మీలా ప్రజల్లో కలిసిపోవాలి. వాళ్ళ అవసరాలు తెలుసుకుని తీర్చాలి. అవునా?"

"అంతేకదా"

"మరాయన ఏం చేశాడు?"

"ఏం చేశాడు?"

"ఏమీ చెయ్యలేదు. చేయలేదంటే వాళ్ళక్కావల్సింది ఏమీ చేయలేదని. వార్డులో ఉండే సామాన్య జనానికి

# చరిత్రలో ఈవారం

**జూన్ 24**

1894: ఆ ఏడాది నుంచి నాలుగేళ్లకొకసారి ఒలింపిక్ పోటీలు నిర్వహించాలని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం నిర్ణయించింది.



**1961: భారతదేశపు తొలి సూపర్‌సానిక్ ఫైటర్ విమానం 'హెచ్ఎఫ్ 24' ప్రారంభం.**

1963: తపాలా శాఖ దేశంలో తొలిసారిగా నేషనల్ టెలెక్స్ సర్వీసును ప్రారంభించింది.

**జూన్ 25**

1658: సింహాసనం కోసం సోదరులతో తలపడి గెలిచిన ఔరంగజేబు తన తండ్రి షాజహాన్‌ను గృహనిర్బంధంలో పెట్టించాడు. చక్రవర్తి భోగాలనుభవించిన షాజహాన్ నాటి నుంచి తాను చనిపోయేదాకా ఆగ్రా కోటలో బందీ అయి తాజ్‌మహల్‌ను చూస్తూ గడపాల్సి వచ్చింది.

1932: అంతర్జాతీయ టెస్టుక్రికెట్‌లో భారత్ ఆరంగేట్రం. ఆ మ్యాచ్‌లో మన జట్టు లండన్‌లోని లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్ జట్టుతో తలపడింది.

1946: ఇరవయ్యారు మంది సిబ్బందితో ప్రపంచ బ్యాంకు కార్యకలాపాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి.



**1967: ప్రపంచంలోనే మొట్టమొదటిసారి శాటిలైట్ ద్వారా ప్రత్యక్షప్రసారాలు ప్రారంభం. ఇంటెల్ శాట్-I, 2 తదితర ఉపగ్రహాల సాయంతో ప్రసారమైన ఆ కార్యక్రమం 'న్యూ వరల్డ్'. సుప్రసిద్ధ అమెరికన్ మ్యూజిక్ బ్యాండ్- బీటిల్స్ పాడిన 'ఆల్ యూ నీడ్ ఈజ్ లవ్ ' అనే పాటను ప్రత్యక్షంగా టెలికాస్ట్ చేశారు.**

1975: ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో అత్యవసర స్థితిని విధిస్తున్నట్లు ప్రకటించింది. ప్రధాని, కేంద్ర మంత్రిమండలి సిఫారసు మేరకు రాజ్యాంగ నిబంధన 352 ప్రకారం ఆరోజు అర్ధరాత్రి ఎమర్జెన్సీ ఫైలుపై రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ సంతకం చేశారు.



**1983: ప్రుడెన్షియల్ వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో వెస్టిండీస్ జట్టుపై భారతజట్టు గెలిచి ప్రపంచకప్ సాధించింది.**

**జూన్ 27**

1880: హెలెన్‌కెల్లర్ జననం. విషజ్వరం కారణంగా చిన్న వయసులోనే చూపూ మాటా వినికిడి శక్తీ పోగొట్టుకున్న కెల్లర్ కుంగిపోలేదు. తన జీవిత కాలంలో 39దేశాల్లో పర్యటించి తన లాంటి వారికి వెలకట్టలేని సేవలు చేసిన హెలెన్‌కెల్లర్ పేరుతో ప్రపంచంలో ఇప్పటికీ అనేక దేశాల్లో బధిరులకూ అంధులకూ పాఠశాలలు కొనసాగుతున్నాయి.

1964: నాటి ప్రధాని అధికార నివాసమైన తీన్‌మూర్తి భవన్‌ను చాచానెహ్రూ జ్ఞాపకార్థం 'నెహ్రూ మెమోరియల్ మ్యూజియం'గా మార్చారు.



**1967: లండన్‌లోని ఎన్‌ఫీల్డ్ ప్రాంతంలో ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఏటీఎం(ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్)'ను ఏర్పాటు చేశారు.**

**జూన్ 28**

1914: ఆస్ట్రియా రాజు ఆర్క్ డ్యూక్ ఫ్రాంజ్ ఫెర్డినాండ్‌ను సెర్బియాకు చెందిన గవ్రిలో ప్రిన్సిప్ అనే విద్యార్థి హత్యచేశాడు. దాంతో ఆగ్రహించిన ఆస్ట్రియా, హంగరీ కూటమి సెర్బియాపై యుద్ధం ప్రకటించింది. ఈ దేశాల మధ్య ఆరంభమైన పోరు క్రమంగా మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసింది. ఆవిధంగా గవ్రిలో ప్రిన్సిప్ మొదటి ప్రపంచ యుద్ధానికి కారకుడుగా నిలిచిపోయాడు.

1921: బహుభాషాకోవిదుడూ భారత మాజీప్రధాని పి.వి.నరసింహారావు కరీంనగర్ జిల్లా వంగర గ్రామంలో జన్మించారు.

**జూన్ 29**

1998: ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్రహోదా ఇవ్వాలనీ కొత్తగా ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్, వనాంచల్ రాష్ట్రాలను ఏర్పరచాలనీ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**జూన్ 30**

1908: రష్యాలోని తుంగుస్కా నది సమీపంలో ఖగోళపదార్థమేదో గాల్లోనే మండిపోవడం వల్ల బ్రహ్మాండమైన పేలుడు సంభవించింది. 'తుంగుస్కా ఎక్స్‌ప్లోజన్'గా పేరుగాంచిన ఈ పేలుడులో విడుదలైన శక్తి హిరోషిమా మీద అమెరికా వేసిన 'లిటిల్‌బాయ్' ఆటంబాంబు కన్నా వెయ్యిరెట్లు ఎక్కువ. జనావాసాలు లేని ప్రాంతం కావడంతో ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట.

1986: మిజోరాంకు రాష్ట్రహోదా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.

---

(13వ పేజీ తరువాయి)

కావాల్సింది లైబ్రరీలూ పార్కులూ కాదు. ఊరేగింపులూ సభలూ కాదు. పంపుల్లో నీళ్ళు ఆగకుండా రావాలి. వీధి దీపాలు ఆరకుండా వెలగాలి. వీధుల్లో చెత్త లేకుండా ఉండాలి. మురుగునీరు పద్ధతిగా పారాలి. ఇవేవీ సరిగ్గాలేవని జనం గోలగోలపెడుతున్నా పట్టించుకోకపోయేసరికి వాళ్ళకి బాగా తెలిసొచ్చింది. భేషజాలు చూపించే నాయకుడు మాకొద్దనుకున్నారు. సామాన్యుల్లో సామాన్యుడిగా కలిసిపోయి వాళ్ళ బాధల్లో బాధ పంచుకుని, తమ సంక్షేమం కోసమే పాటుపడే తమ మనిషి కావాలనుకున్నారు. మళ్ళీ మిమ్మల్ని గెలిపించారు. దగ్గరికి రప్పించుకున్నారు".

"ఏమైనాగానీ గోవిందయ్యా, ఉన్నది ఉన్నట్టుగా మా బాగా చెబుతావయ్యా".

"మీ అభిమానం"

"రోజా వస్తూ ఉండు".

"మీరు చెప్పాలా? "

"మీ వదిన లడ్డూలు చేసింది నిన్న. వెళ్ళేప్పుడు ఆవిణ్ణి కలిసి వెళ్ళు".

"అలాగలాగే".

★ ★ ★

మరోసారి ఎలక్షన్లు ముగిశాయి. రాజశేఖరం గారి ఇంటిమీద విజయపతాకం రెపరెపలాడింది.

మరుక్షణం అక్కడ ప్రత్యక్షమయ్యాడు గోవిందయ్య.

"ఆహా, దైత్య పలాయనానంతరం తిరిగి వెలిగిపోతున్న అమరావతిలాగే ఉందయ్యా ఈ లోగిలి".

"నువ్వా? మళ్ళీ ఇక్కడికా? "

"అవును బాబూ నేనే. ఇక్కడికే వచ్చాను. అయ్యా, సప్తర్షులంతటివాళ్ళు కానికాలం వస్తే ఎవరో దానవరాజు పల్లకీ మోశారని శాస్త్రాలు చెబుతున్నాయి. నేనెనగా ఎంత? దస్యు పరాజయం తర్వాత కూడా ఆ కాడి మోస్తూ అలాగే భుజం కాయలు కట్టించుకోమంటారా? నన్నక్కడలాగే మగ్గిపొమ్మంటారా? మీ చల్లనినీడకు రావద్దంటారా చెప్పండి".

"... ... ..."

"అయ్యా, మాబోంట్లకిక చీకటిదినాలు ముగిసినట్టే. వెన్నెల దినాలు వచ్చేసినట్టే. ఇంక మీరే మా ప్రభువు. మీరే ఇంద్రుడు... మీరే చంద్రుడు... దైవం మీరే..."

★ ★ ★

"రామస్వస్తి-రావణస్వస్తి అంటే ఏమిటో తెలుసా? "

"తెలీదే!"

"ఇదిగో ఇదే!" ★